

సువర్ణ వాహనాల ప్రతిష్ఠ

భద్రాద్రి రామయ్యకు దాతలు సమకూర్చిన సువర్ణ వాహనాలకు ప్రతిష్ఠా మహోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. 8లో



పనులు త్వరగా పూర్తిచేయండి

మన ఊరు – మన బడి ద్వారా చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 18°

వాతావరణం

శనివారం తెల్లవారుజామున కాస్త చలి ప్రభావం ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది.

న్యూస్‌రీల్

6న మైనార్టీ రుణ దరఖాస్తులు పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: గత ఆర్థిక సంవత్సరం(2021–22)లో మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం అందిన దరఖాస్తులను ఈనెల 6వ తేదీన పరిశీలించనున్నట్లు కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు 6న ఉదయం 11 గంటల వరకు నగర పాలక సంస్థ కార్యాలయానికి అన్ని ఒరిజినల్ ధృవపత్రాలతో రావాలని సూచించారు. దరఖాస్తులు, సర్టిఫికెట్లు పరిశీలించాక లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని కమిషనర్ తెలిపారు.

‘ఐలు’ ఆధ్వర్యాన నేడు శిక్షణ తరగతులు

ఖమ్మం లీగల్: ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యాన శనివారం జూనియర్ న్యాయవాదులకు శిక్షణ తరగతులు ఏర్పాటుచేశారు. ఖమ్మంలోని టీటీడీసీలో ఉదయం 10–30 గంటలకు మొదలయ్యే శిక్షణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు న్యాయవాదులు కమిషన్ వర్క్ ఎలా చేయాలనే అంశంపై అవగాహన కల్పిస్తారు. అలాగే, హైకోర్టు న్యాయమూర్తి కె.అనిల్ కిరణ్‌కుమార్, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కె.ఆశారాణి పలు అంశాలపై శిక్షణ ఇస్తారని ఐలు కార్యవర్గ బాధ్యులు ఎస్.నవీన్‌చైతన్య, చింతనిప్పు వెంకట్, మందడపు శ్రీనివాసరావు, వై.శ్రీనివాసరావు, మీసాల వెంకటేశ్వర్లు, వీరు తెలిపారు. ఈ కార్యక్రమానికి న్యాయవాదులు అధిక సంఖ్యలో హాజరుకావాలని వారు కోరారు.

పట్టుసాగుపై క్షేత్రస్థాయి పరిశీలన



జనగామలో పట్టు సిల్క్ రీలింగ్‌ను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

రఘునాథపాలెం: ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ పరిధిలోని రైతులు, సభ్యులు పట్టుసాగు, మార్కెటింగ్‌పై అవగాహన కోసం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. గత రెండు రోజులుగా వీరికి ఇక్కడ శిక్షణ ఇవ్వగా, శుక్రవారం జనగామకు వెళ్లి పట్టు గూళ్ల పెంపకం, సిల్క్ రీలింగ్ యూనిట్లను సందర్శించారని జిల్లా ఉద్యానవన అధికారి అనసూయ తెలిపారు. ఖమ్మం డివిజన్ ఆత్మ కమిటీ అధ్యక్షుడు భూక్యా లక్ష్మణ్‌నాయక్, ఏఓ భాస్కర్‌రావు, సెరికల్చర్ అధికారులు సురేష్, శ్రీనివాసరావు, ఏఈఓ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై లోకాయుక్త విచారణ



తవ్వకాలపై విచారణ చేస్తున్న లోకాయుక్త అధికారి మాథ్యూకోషి

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక, చింతగుర్తి, మంచుకొండ రెవెన్యూ పరిధి ప్రభుత్వ భూముల్లో మొరం, గ్రావెల్ అక్రమ తవ్వకాలపై లోకాయుక్త శుక్రవారం మరోసారి విచారణ చేపట్టింది. గత జనవరిలో విచారణ జరగగా, కోయిన్ని వెంకన్న, భద్రునాయక్ తిరిగి లోకాయుక్తను ఆశ్రయించారు. గతంలో విచారణ సందర్భంగా తవ్వకందారులకు మైనింగ్ శాఖ ద్వారా రూ.16 కోట్ల జరిమానా విధించారు. దీంతో వారు తమ తప్పిదమేమీ లేదని కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. మళ్లీ ఫిర్యాదుదారులు లోకాయుక్తను ఆశ్రయించడంతో క్వారీల్లో విచారణ చేశారు. తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త ఇన్వెస్టిగేషన్ అధికారి మాథ్యూకోషి విచారణకు రాగా, మైనింగ్, సర్వే అధికారులతో కలిసి మట్టి తవ్వకాలు జరిగిన ప్రాంతంలో పరిశీలించారు. మైనింగ్ అధికారులు గంగాధర్, గిర్దావర్ ప్రసాద్, సర్వేయర్ శ్రీనివాసరావు, శ్రీధర్, ఫిర్యాదుదారులు ముస్తఫా, ప్రేమ్‌కుమార్, కోటి, మందా బుచ్చిబాబు, రైతులు, పోలీసులు పాల్గొన్నారు. కాగా, నేషనల్ హైవే రోడ్ల నిర్మాణం కోసం తాత్కాలిక లీజు క్వారీపై కూడా ఆరోపణలు రావడంతో అధికారులు పరిశీలించారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచరూరల్: పాల్వంచ మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం పంచామృతాభిషేకం, అర్చన నిర్వహించారు. ముందుగా మేళతాళాలతో అమ్మవారి జన్మస్థలం వద్ద పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూలవిరాట్‌కు అభిషేకం, నివేదన, పంచహారతులు, నీరాజన మంత్రపుష్పార్చన గావించారు. ఈ పూజల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



ఆపరేషాన్!

- జిల్లా పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలపై నిర్లక్ష్యం
- నానాటికీ తగ్గుముఖం పడుతున్న ఆపరేషన్లు
- ఆరోగ్యశ్రీ సేవలపైనా పట్టింపు కరువు
- వైద్యుల నిర్లక్ష్యం.. అధికారుల పట్టింపులేనితనంతో పేదల అవస్థ

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా పెద్దాస్పత్రిలో సాధారణ చికిత్స మాటేమో కానీ శస్త్రచికిత్సలపై వైద్యులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇష్టం వచ్చినప్పుడు.. తమకు కుదిరినప్పుడు మాత్రమే ఆపరేషన్లు నిర్వహిస్తుండడంతో నానాటికీ సంఖ్య తగ్గుముఖం పడుతోంది. ఎంతో పేరు ఉన్న ఆస్పత్రిలో కొందరి తీరు మూలంగా నిరుపేదలు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పైసా ఖర్చులేకుండా ఉచితంగా శస్త్ర చికిత్స చేయించుకుందామని వచ్చేవారు రోజుల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సాధారణంగా శస్త్రచికిత్సలే కాకుండా ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించే ఆపరేషన్లపై కూడా తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుండడంతో ఆస్పత్రికి వచ్చే ఆదాయానికి కూడా గండిపడుతోంది.

అజమాయిషీ లేకపోవడంతోనే..

జిల్లా ఆస్పత్రిలో జనరల్, ఈఎన్‌టీ, గైనిక్, నెఫ్రాలజీ, యూరాలజీ, న్యూరో, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, పాలీ ట్రామా, పల్మనాలజీ వంటి విభాగాల్లో శస్త్రచికిత్సలు ఎక్కువగా జరుగుతాయి. అవసరమైన వారికి శస్త్రచిక్సితలు అనుకున్న సమయానికి చేయాల్సి ఉన్నా.. కొందరు వైద్యుల తీరుతో ఆ లక్ష్యం నెరవేరడం లేదు.

పెద్దాస్పత్రిలో మొత్తం 106 మంది వైద్యులు విధులు నిర్వర్తిస్తుండగా, వీరిలో కొందరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తుడడం, తమకు కుదిరిన సమయానికి వచ్చి వెళ్తుండడమే కాక అధికారుల మాటలను ఖాతరు చేయడం లేదని తెలుస్తోంది. సగం మంది వైద్యులకు సొంత క్లినిక్‌లు ఉండడంతో ఇష్టమొచ్చిన సమయానికి వచ్చి.. అర గంట, గంట సమయానికి తిరుగు ముఖం పడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ఓపీ చూపించుకునే ఇబ్బంది పడుతుండగా.. ఆతర్వాత శస్త్రచికిత్స అవసరమైన వారిని ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఫలితంగా చేసేదేం లేక పలువురు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

వచ్చేది ఎక్కువగా పేదవారే. జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో వైద్యులను నియమించడమే కాక పెద్ద మొత్తంలో నిధులు వెచ్చిస్తూ సౌకర్యాలు, వసతులు కల్పించాం. అయినా అందుకనుగుణంగా సేవలు అందడం లేదు. అన్ని పరికరాలు, నిపుణులు ఉన్నా అనుకున్న స్థాయిలో శస్త్రచికిత్సలు చేయకపోవడం ఏమిటి? ఇకనైనా వైద్యులు, అధికారులు తీరు మార్చుకోవాలి.

– ఇటీవల వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో కలెక్టర్ గౌతమ్



ప్రధాన ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్

2022 ఏప్రిల్ నుండి ఈ ఏడాది జనవరి వరకు పెద్దాస్పత్రిలో జరిగిన ఆపరేషన్లు

నెల	మేజర్	మైనర్	ఆరోగ్యశ్రీ శస్త్రచికిత్సలు
ఏప్రిల్	521	407	423
మే	522	431	---
జూన్	640	571	570
జూలై	746	602	632
ఆగస్టు	685	440	465
సెప్టెంబర్	785	629	565
అక్టోబర్	621	629	405
నవంబర్	736	566	591
డిసెంబర్	628	534	552
జనవరి	540	460	323

అందరూ ఉన్నా...

ఖమ్మం ఆస్పత్రికి అనుసంధానంగా గత ఏడాది మార్చిలో రాష్ట్రప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రకటించి నిధులు కూడా విడుదల చేసింది. పాత కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ, పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయాలు, స్థలాలను కేటాయించడమే కాక ప్రిన్సిపల్, సీనియర్ రెసిడెంట్ వైద్యులను నియమించింది. త్వరలో బోధనా సిబ్బంది కూడా రానున్నారు. ఈ తరుణాన గత 22న కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆస్పత్రి అధికారులు, వైద్యులతో సమీక్షించగా.. శస్త్రచికిత్సల నివేదికలు చూసిన ఆయన అధికారులు, వైద్యులను మందలించారు. కొన్ని నెలలుగా శస్త్రచికిత్సలు తగ్గుముఖం పడుతున్నాయని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలు కూడా కుంటుపడడంతో కారణాలు ఆరా తీసి.. ఇకనైనా వైద్యులు తీరు మార్చుకోవాలని, సమయపాలన పాటించాలని ఆదేశించారు.

శస్త్రచికిత్సలు పెంచేలా పర్యవేక్షణ



పెద్దాస్పత్రిలో శస్త్రచికిత్సలు పెంచేలా వైద్యులకు ఆదేశాలు ఇచ్చాం. వైద్యులందరికీ లక్ష్యాలు నిర్దేశించాం. ఇక నుంచి ప్రతీవారం సమీక్షిస్తూ ఎవరైనా నిర్లక్ష్యంగా వహించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని నిర్ణయించాం. అలాగే ఆరోగ్యశ్రీ ద్వారా నిర్వహించే శస్త్రచికిత్సలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– బి.వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్

గ్యాస్ ‘మంటలు’



ఖమ్మం ధర్నాచౌక్‌లో నిరసనలో పాల్గొన్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ, నాయకులు

- కదం తొక్కిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- సిలిండర్ ధర పెంపుపై ఆందోళన
- ఖమ్మంలో వంట చేసి నిరసన తెలిపిన మంత్రి పువ్వాడ

సాక్షిప్రతినిధి, ఖమ్మం: గ్యాస్‌సిలిండర్ ధరను రూ.50 మేర పెంచడాన్ని నిరసిస్తూ శుక్రవారం బీఆర్‌ఎస్ శ్రేణులు జిల్లావ్యాప్తంగా నిరసనలు చేపట్టాయి. కేంద్రప్రభుత్వ తీరును ఎండగడుతూ నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రదర్శనలు, రాస్తారోకోలు నిర్వహించాయి. ఖమ్మంలోని ధర్నాచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొనగా, తల్లాడలో పొయ్యి, కట్టెలతో కూడిన కావడి మోస్తూ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య వినూత్న నిరసన తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

ఖమ్మంలోని ధర్నాచౌక్‌లో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆందోళనలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్ల దుస్తులు, బ్యాడ్జీలు ధరించి గ్యాస్ సిలిండర్ల కటౌట్లు, కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పువ్వాడ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం సామాన్యులు, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందని ఆరోపించారు. ఏడాదిలో మూడుసార్లు గ్యాస్ ధరలు పెంచినా ఒక్క బీజేపీ నాయకుడు మాట్లాడలేదని పేర్కొన్నారు. పెరిగిన ధరలు తగ్గించే వరకు ఆడబిడ్డలు చేపట్టే ఉద్యమానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని తెలిపారు. ఇక చిరు వ్యాపారాలు చేసుకునే వారు వినియోగించే కమర్షియల్ సిలిండర్ ధరను కూడా రూ.350 పెంచడం అన్యాయమని పేర్కొన్నారు. ధరలు పెంచడంలో బీజేపీ నేతలు కాంగ్రెస్‌ను మించిపోయారని విమర్శించారు. తెలంగాణ ప్రజలు సంతోషంగా ఉండాలని సీఎం కేసీఆర్ ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇస్తుండగా, ప్రధాని మోడీ మాత్రం పెట్రోల్, గ్యాస్, పప్పులు, నిత్యావసర ధరలు పెంచి ప్రజల రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ నిరసనలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఏఎంసీ చైర్మన్ దోరేపల్లి శ్వేత, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, నాయకులు వీరూనాయక్ తదితరులు పాల్గొన్నారు.



తల్లాడలో తలపై కట్టెల మోపుతో నిరసనలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే వెంకటవీరయ్య, నాయకులు

- వైరాలోని క్రాస్‌రోడ్డులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యాన నిరసన తెలపగా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, సీపీఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. ఇక కొణిజర్లలో కూడా ప్రదర్శన నిర్వహించారు. ఏన్కూరులో మాజీ ఎమ్మెల్యే బానోతు చంద్రావతి ఆధ్వర్యాన నిరసన తెలిపి దున్నపోతుకు వినతిపత్రం అందజేశారు.
- సత్తుపల్లి అంబేడ్కర్ సెంటర్‌లో గ్యాస్ సిలిండర్లతో బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలపగా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తల్లాడలో పొయ్యి, కట్టెల కావడితో నిరసన తెలపగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తలపై కట్టెల మోపుతో ప్రదర్శనలో పాల్గొన్నారు. అలాగే కల్లూరులో కూడా బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసన తెలిపాయి.
- మధిర అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన తెలిపిన నాయకులు పట్టణంలో ర్యాలీ నిర్వహించగా జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, వైస్ చైర్‌పర్సన్ శీలం విద్యాలత తదితరులు పాల్గొన్నారు. ఎర్రుపాలెంలో వంటావార్పు చేపట్టగా మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాంబశివరావు, ఎంపీపీ దేవరకొండ శిరీష పాల్గొన్నారు. చింతకానిలో రోడ్డుపై కట్టెల పొయ్యి ఏర్పాటుచేసి వంట చేయగా ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య పాల్గొన్నారు.
- ఖమ్మం రూరల్ మండలం నాయుడుపేటలో ఖాళీ సిలిండర్లతో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న మోదీ డౌన్ డౌన్ అంటూ నినదించారు. ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ.వరప్రసాద్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు తదితరులు పాల్గొన్నారు.

రేపు అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష

- జిల్లాలో 14 కేంద్రాలు, 6,049మంది అభ్యర్థులు
- ఏర్పాట్లపై సమీక్షించిన అదనపు కలెక్టర్

ఖమ్మం సహకారనగర్: వివిధ ప్రభుత్వ శాఖల్లో అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) నియామకాలకు కేంద్ర కుటుంబ సంక్షేమ శాఖ, టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యాన ఈనెల 5వ తేదీన పరీక్ష జరగనుంది. ఈమేరకు జిల్లాలో 14 కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా 6,049మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో జరుగుతుంది. ఉదయం 10నుంచి 12–30గంటల వరకు జరిగే పరీక్షకు 9–45గంటల వరకు, మధ్యాహ్నం 2–30నుంచి 5 గంటల వరకు జరిగే పరీక్షకు మధ్యాహ్నం 2–15గంటల వరకు అభ్యర్థులను అనుమతిస్తామని అదనపు కలెక్టర్ ఎన్.మధుసూదన్ తెలిపారు. పరీక్ష ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన అధికారులతో సమీక్షించారు. ఓఎంఆర్ షీట్లలో తప్పులు దొర్లకుండా అభ్యర్థులకు ముందే అవగాహన కల్పించాలని తెలిపారు. పరీక్ష కేంద్రాలను మూడు రూట్లుగా విభజించి లైజనింగ్, అసిస్టెంట్ లైజనింగ్ అధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లను నియమించినట్లు చెప్పారు. కాగా, అభ్యర్థులు ఏదైనా ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్వో శిరీష, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పరీక్ష జరిగే కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలుచేయనున్నట్లు సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. అలాగే, నీట్ పీజీ పరీక్ష కేంద్రాల వద్ద కూడా బందోబస్తు ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు.

స్వయం ఉపాధి దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంగాంధీచౌక్: దివ్యాంగులు స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 6వరకు పొడిగించినట్లు జిల్లా సంక్షేమాధికారి సంధ్యారాణి తెలిపారు. అంగవైకల్యం 40శాతం కలిగి ఉండి 21 నుంచి 55 ఏళ్ల వయసు వారు అర్హులని పేర్కొన్నారు. రూరల్ ప్రాంత వాసులైతే వార్షికాదాయం రూ.1.50 లక్షలు, అర్బన్ ప్రాంతం వారైతే రూ.2 లక్షలు కలిగి ఉండాలని, గడిచిన ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి రుణం పొందని వారు సదరమ్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, రేషన్ కార్డు, ఆదాయం, విద్యార్హత సర్టిఫికెట్లతో www.obmms.cgg.gov.in సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చదవలేరు.. రాయలేరు.. లెక్కలు కూడా రావా?

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు లెక్కలు చేయడం, చదవడం, రాయడంలో వెనుకబడడంపై డీఈఓ సోమశేఖరశర్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలను డీఈఓ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈక్రమంలో పలువురు విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు లెక్కలు చేయడంలో తడబడగా ఉపాధ్యాయుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకనైనా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు నమోదయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని హెచ్‌ఎంకు సూచించారు. ఇంకా ఈ తనిఖీల్లో ఎంఈఓ రామాచారి పాల్గొన్నారు.


భూ బకాసురులు

- రూ.కోట్ల విలువైన భూమి కాజేసేందుకు ప్లాన్
- యజమాని చనిపోయినట్లు నకిలీ డాక్యుమెంట్లు..
- ఆపై తానే వారసుడినంటూ రిజిస్ట్రేషన్
- అధికారుల పరిశీలన, కబ్జాదారుల పంపకాల్లో గొడవతో వెలుగులోకి...
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

ఖమ్మంరూరల్: జిల్లా కేంద్రంతో పాటు సమీప మండలాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడంతో అక్రమార్కులు ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాకు అడుగులేస్తున్నారు. స్థలం పుట్టుపూర్వోత్తరాల కూపీ లాగి.. యజమానులు దూరప్రాంతాల్లో ఉన్నారని తెలిస్తే నకిలీ డాక్యుమెంట్లు, ఫోర్జరీ సంతకాలతో కాజేస్తున్నారు. ఇదే తరహాలో తప్పుడు డాక్యుమెంట్లతో 5.22ఎకరాల భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోగా.. రెవెన్యూ అధికారులు సీడీఎంఏ ద్వారా పరిశీలించడంతో చిక్కారు.

అసలేం జరిగిందంటే..

ఖమ్మం రూరల్ మండలం తనగంపాడులోని సర్వే నంబర్ 43లో పొలగాని కోదండరామిరెడ్డి పేరుతో 5.22ఎకరాల భూమి ఉంది. ఈ భూమి విలువ ఎకరానికి రూ.60లక్షలకు పైగానే ఉండగా, మొత్తంగా రూ.3.50కోట్ల నుంచి రూ.4.కోట్ల వరకు విలువ పలుకుతుందని సమాచారం. అయితే, కోదండరామిరెడ్డి భార్య పద్మావతితో కలిసి హైదరాబాద్‌లో ఉంటూ కొన్నేళ్లుగా గ్రామానికి రావడం లేదు. దీంతో అక్రమార్కుల కన్ను ఈ భూమిపై పడింది. యజమాని కోదండరామిరెడ్డి, ఆయన భార్య పద్మావతి మృతి చెందినట్లుగా మీ సేవా కేంద్రం ద్వారా ధ్రువీకరణ పత్రాలు తీసుకున్నారు. అనంతరం రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ మండలం మేడిపల్లికి చెందిన తాడూరి నిరంజన్‌రెడ్డి తాను పద్మావతి చెల్లెలి కొడుకునని, కోదండరామిరెడ్డికి వారసులు లేనందున కర్మకాండలు నిర్వహించానని చెబుతూ తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని గత ఏడాది అక్టోబర్ 26న రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. దీంతో అధికారులు 5.22ఎకరాల భూమిని నిరంజన్‌రెడ్డి పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈక్రమంలో భూమిని కబ్జా చేసేందుకు పన్నాగం పన్నిన ఇద్దరు వ్యక్తులు నిరంజన్‌రెడ్డికి సహకరించగా, ఆతర్వాత భూమిని నేలకొండపల్లికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి బినామీకి అమ్మారు. ఈ వ్యవహారం మొత్తం రెగ్యులర్ తహసీల్దార్ లేని సమయంలో జరగగా, రూ.లక్షల్లో చేతులు మారినట్లు తెలుస్తోంది.



నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమిని మరో వ్యక్తికి అమ్మాక రిజిస్ట్రేషన్ చేయించిన డాక్యుమెంట్

ఆరా తీస్తున్న అధికారులు

నకిలీ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్లు సృష్టించి ఒకే భూమిని ఒకరి తర్వాత మరొకరికి అమ్మిన వ్యవహారంపై పూర్తి వివరాలు, రికార్డులను ఖమ్మం రూరల్ తహసీల్దార్ టి.సుమ.. ఆర్డీఓ రవీంద్రనాథ్‌కు అందజేశారు. దీంతో ఘటన వెనుక ఎవరి పాత్ర ఉంది, నకిలీ సర్టిఫికెట్ల తయారీకి అధికారులు సహకరించారా అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా వ్యవహారం కలెక్టర్ దృష్టికి కూడా వెళ్లగా ఆయన పరిశీలిస్తున్నారు. అలాగే, ఎస్‌బీ, ఇంటెలిజెన్స్ వర్గాలు సైతం రంగంలోకి దిగడంతో ఒకటి, రెండు రోజుల్లో ఈ వ్యవహారం వెనుక ఎందరు ఉన్నారనేది తేలే అవకాశముంది.

మీ సేవ కేంద్రం నిర్వాహకుడి కీలకపాత్ర

మొత్తం వ్యవహారంలో మీ సేవా కేంద్రం నిర్వాహకుడు ప్రముఖ పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. నకిలీ మరణ ధృవీకరణ పత్రాల తయారీలో కీలకంగా వ్యవహరించిన ఆయన, నిర్ణీత గడువు వరకు మాత్రమే తాను తయారు చేసిన నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డులు ఆన్‌లైన్‌లో కనిపించేలా చేయడంలో దిట్ట అని తెలుస్తోంది. ఈయన ఓ రెవెన్యూ అధికారికి బంధువు కావడం గమనార్హం. దీంతో అధికారి అండదండలు చూసుకొని ఇలాంటి పనులన్నీ చేస్తుంటాడని సమాచారం. కాగా, మీ సేవా నుంచి జారీ అయినట్లుగా సృష్టించిన తప్పుడు డెత్ సర్టిఫికెట్ ద్వారా జరిగిన రిజిస్ట్రేషన్ సంఖ్యను రెవెన్యూ అధికారులు సీడీఎంఏ ద్వారా సరి చూసుకోవడంతో మొత్తం వ్యవహారం బయటపడింది. ఇదేసమయాన అక్రమార్కులు డబ్బు పంచుకునే విషయంలో విబేధాలు రావడంతో అందులో ఒకరు అధికారులు దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం.

డీటీ ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

నకిలీ డాక్యుమెంట్లు, ఫేక్ సర్టిఫికెట్లతో భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న విషయమై డీటీ కరుణశ్రీ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. కోదండరామిరెడ్డి వారసుడినంటూ భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్న నిరంజన్‌రెడ్డి కోసం వేట ప్రారంభించారు. ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక పోలీస్ బృందాలు హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఏసీపీ కూడా ధృవీకరించారు.

పరిశీలనలో గుర్తించా...

భూమి రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సదరు వ్యక్తులు స్లాట్ బుక్ చేసుకున్నారు. డెత్ సర్టిఫికెట్, ఆర్‌ఐ నివేదిక, అఫిడవిట్లు చూశాకే రిజిస్ట్రేషన్ చేశా. అనంతరం అనుమానం వచ్చి సీడీఎంఏ ద్వారా చెక్ చేయడంతో డెత్ సర్టిఫికెట్ నకిలీదని తేలింది. దీంతో నిరంజన్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేశా.

– కరుణశ్రీ, డీటీ, ఖమ్మం రూరల్

అక్రమార్కులను వదిలిపెట్టం..

బతికి ఉన్న వ్యక్తి మృతి చెందినట్లుగా తప్పుడు సర్టిఫికెట్‌తో ఆయన పేరిట ఉన్న భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు, సహకరించిన వారిని వదిలేదు లేదు. ఈ విషయమై ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చాం. ఉద్యోగుల పాత్ర ఉందని తేలినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– తాళ్లూరి సుమ, తహసీల్దార్, ఖమ్మం రూరల్

క్లుప్తంగా

సమ్మేళనం ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న నాయకులు

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం మండల కేంద్రంలో ఆదివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన పాలేరు నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనం జరగనుంది. ఈ సమ్మేళనం ఏర్పాట్లను నాయకులు శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈకార్యక్రమంలో తుంబూరి దయాకర్‌రెడ్డి, మద్దినేని బేబీస్వర్ణకుమారి, మువ్వా విజయ్‌బాబు, నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, తిరుమలరావు, కొప్పుల చంద్రశేఖర్, గోవిందరావు, అజ్మీరా అశోక్‌నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి గోటి తలంబ్రాలు



గోటి తలంబ్రాలతో బయలుదేరుతున్న భక్తులు

ఏన్కూరు: భద్రాచలంలో ఈనెల 30న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి మండలంలోని తూతకలింగన్నపేట రామాలయం భక్తబృందం బాధ్యులు గోటి తలంబ్రాలను సమర్పించనున్నారు. నెల రోజులుగా గోటితో వలిచిన తలంబ్రాలతో వారు శుక్రవారం పాదయాత్రగా బయలుదేరారు. తొలుత గ్రామంలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షుడు ఇల్లూరి ఆదినారాయణతో పాటు ఆళ్ల సుబ్బారావు, కట్టా నాగేశ్వరరావు, కొవ్వూరి నాగేశ్వరరావు, ఖాదర్‌బాబు, మండేపూడి సూర్యనారాయణ, నల్లమోతు రామారావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల ఆందోళనలు

ఖమ్మంవ్యవసాయం: వేతన సవరణను వెంటనే అమలుచేయడంతో పాటు ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యుత్ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఖమ్మం విద్యుత్ సర్కిల్ ఆపరేషన్స్ కార్యాలయం ఎదుట ఇంజనీర్లు, ఉద్యోగులు, కార్మికులు నిరసన తెలిపారు. వేతన సవరణలో తాత్సారం చేస్తున్నారని, ఏడాది కావొస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. యాజమాన్యం స్పందించకపోతే నిరాహార దీక్షలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల ప్రతినిధులు హీరాలాల్, రమణారెడ్డి, రవికుమార్, ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, సత్యనారాయణ, రామకృష్ణ, సీతారాంగోపాల్, నాగేశ్వరరావు, పుష్పరాణి, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా చెరువు సొసైటీ సమావేశం

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాదారం చెరువు మత్స్య సొసైటీ సమావేశం రసాభాసగా ముగిసింది. కోరం లేకపోవడమే కాక సమావేశానికి హాజరైన జిల్లా అధికారిపై సభ్యులు దురుసుగా ప్రవర్తించడంతో వాయిదా వేశారు. చెరువుమాదారం చెరువు మత్స్య సొసైటీ పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించగా జిల్లా మత్స్యశాఖ అధికారి డి.ఆంజనేయస్వామి హాజరయ్యారు. మొదటల్లోనే కొందరు సభ్యులు అధికారితో దురుసుగా ప్రవర్తించడమే కాక సభ్యుల లెక్క, చెరువు విస్తీర్ణం, ఓటర్ల జాబితాపై ప్రశ్నించే క్రమంలో అరుపులు, కేకలతో గందరగోళం నెలకొంది. దీనికి తోడు సమావేశం నిర్వహణకు లెక్కించగా కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు అధికారి ప్రకటించారు. ఈ సమావేశంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు యడవల్లి చంద్రయ్యతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి యువకుడు మృతి

సత్తుపల్లిటౌన్: ప్రమాదవశాత్తు ఇంటి ఆవరణలో నీటి సంపులో పడిన యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఇలా ఉన్నాయి. పట్టణంలోని వెంగళరావునగర్‌కు చెందిన మహ్మద్ హుస్సేన్(23) ఓ దుకాణంలో గుమస్తాగా, ఆయన తల్లిదండ్రులు సలీం, హైమదీ సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్నారు. గురువారం రాత్రి కుటుంబ సభ్యులందరూ అదే వీధిలోని నాయనమ్మ వద్దకు వెళ్లగా, హుస్సేన్ కడుపునొప్పి వస్తోందని బాత్‌రూం కోసం ఇంటికి వెళ్లాడు. అయితే, చీకట్లో నీటి సంపును గుర్తించకుండా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఆయన ఎంతకూ రాకపోవడంతో రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు చూడగా సంపులో పడిన ఆయనను బయటకు తీసే సరికి మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సత్తుపల్లి ఏఎస్సై జయబాబు శుక్రవారం తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

'సువర్ణ' వాహనాలకు

ప్రతిష్ఠా మహోత్సవం



స్వర్ణతాపడ వాహనాలపై స్వామి వారి తిరువీధి సేవ నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు



స్వామి వారికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

- చిత్రకూట మండపంలో ప్రత్యేక పూజలు
- వాహనాలతో స్వామివారికి ఘనంగా తిరువీధి సేవ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి ప్రవాసాంధ్ర వాసవీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.65 లక్షల వ్యయంతో తయారుచేయించిన సువర్ణ తాపడ ద్వాదశ వాహనాలకు శుక్రవారం వైభవోపేతంగా ప్రతిష్ఠాపన వేడుకలు నిర్వహించారు. తమిళనాడు నుంచి వచ్చిన ఈ వాహనాలను చిత్రకూట మండపంలో కొలువుదీర్చి గురువారం అంకురార్పణ చేసిన విషయం తెలిసిందే. ఆ వాహనాలపై సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్రస్వామి వారి ఉత్సవ మూర్తులను ఉంచి అర్చకులు, వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం రక్షా బంధనం, జలాధివాసం, క్షీరాధివాసం, ప్రాణ ప్రతిష్ఠ, కుంభ ప్రోక్షణ, మహా పూర్ణాహుతి తదితర పూజలు నిర్వహించారు. గజ, అశ్వ, చంద్రప్రభ, సూర్యప్రభ, గరుడ, శేష, హనుమత్, కల్పవృక్ష, హంస, సింహ, సార్వభౌమ వాహనాలలో ఆశీనులైన స్వామి వారికి భక్తులు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు నాడు భక్త రామదాసు చేయించిన వాహనాలతోనే స్వామివార్లకు ఉత్సవాలను నిర్వహించామని తెలిపారు. ప్రవాసాంధ్ర దాతలు స్వామివారిపై భక్తితో తయారు చేయించిన సువర్ణ పూత వాహనాలతోనే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేకం తదితర కార్యక్రమాలు చేస్తామని వెల్లడించారు. అనంతరం వాహనాల దాతలను దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, ప్రసాదం అందజేశారు. సాయంత్రం ద్వాదశ వాహనాలతో తాతగుడి సెంటర్ వరకు మేళతాళాలు, వేద మంత్రోచ్ఛరణలు, శ్రీరామ నామస్మరణల నడుమ నూతన వాహనాలతో స్వామివార్లకు తిరువీధి సేవ నిర్వహించారు. ఉత్సవాలలో భాగంగా శనివారం సాయంత్రం స్వామివారికి సార్వభౌమ సేవ జరపనున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, దాతలు రంగారావు, సునీత బృందం, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్‌ఎల్ కాంతారావు, చారుగుళ్ల శ్రీనివాస్, ఎస్ఎన్వీ రామారావు, జి.వెంకటాచార్యులు, బండారి కృష్ణయ్య, యశోద రాంబాబు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకవచధారుడైన రామయ్య..

భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూల మూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్ర ధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, శుక్రవారాన్ని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు, సాయంత్రం దర్బారు సేవ నిర్వహించారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన మేయర్ నీరజ తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లలేని పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సాయం అందుతోందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం నియోజకవర్గంలో 157 మందికి మంజూరైన రూ.59.96 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శుక్రవారం ఆయన వీడీవోస్ కాలనీలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ తాను ఎన్నికైనప్పటి నుంచి ఇప్పటి వరకు 4,276 మందికి రూ.18.58 కోట్ల విలువైన చెక్కులు అందజేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పేదరికంలో ఉండి వైద్యం కోసం ఇబ్బంది పడుతున్న వారికి సీఎంఆర్‌ఎఫ్ అండగా నిలుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహర, కార్పొరేటర్లు పసుమర్తి రాంమోహన్, పాకాలపాటి విజయ, దండా జ్యోతిరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, షకీనా, ఇస్సాక్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నది ఒకరే.. ఆమె సెలవు!



టీచర్ లేక ఖాళీగా కుర్చున్న విద్యార్థులు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని మల్లేపల్లి ప్రాథమిక పాఠశాల ఏకోపాధ్యాయులు సెలవు పెట్టడంతో శుక్రవారం రోజంతా విద్యార్థులు ఖాళీ కుర్చీ, బోర్డు చూస్తూ గడపాల్సి వచ్చింది. పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా వసంత విధులు నిర్వర్తిస్తుండగా శుక్రవారం ఆమె సెలవు పెట్టారు. ఇలా జరిగినప్పుడుప్రత్యామ్నాయంగా మరో టీచర్‌ను ఏర్పాటు చేయాల్సినా అధికారులు పట్టించుకోలేదని గ్రామ సర్పంచ్ బండి వెంకన్న ఆరోపించారు. ఈవిషయంపై ఎంఈఓ ఎం.శ్రీనివాస్‌ను వివరణ కోరగా టీచర్ సెలవు పెట్టినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎంకు ఆలస్యంగా సమాచారం అందడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయలేకపోయారని తెలిపారు. ఈ ఘటన తనకు ఆలస్యంగా తెలిసిందని, విచారణ చేసి మరో మారు జరగకుండా చూస్తామని పేర్కొన్నారు.

13 మంది జూదరుల అరెస్ట్

నేలకొండపల్లి: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 13మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శుక్రవారం సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేపట్టారు. ఈమేరకు 13 మందిని అదుపులోకి తీసుకుని రూ.36 వేల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించారు.

ఈర్లపుడిలో..

రఘునాథపాలెం: మండలంలోని ఈర్లపుడిలో పేకాట అడుతున్న ఆరుగురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామశివార్లలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో శుక్రవారం వారిని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

పనులు త్వరగా పూర్తిచేయండి

టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి



సమీక్షలో మాట్లాడుతున్న టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖరశర్మ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని 426 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు– మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేయాలని తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ) చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడం ద్వారా విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని.. తద్వారా పేద, మధ్య తరగతి పిల్లలకు మంచి భవిష్యత్ ఇచ్చినట్లవుతుందన్నారు. పాఠశాలల్లో పూర్తయిన పనులను ఈనెల 10వ తేదీలోగా పండుగ వాతావరణంలో ప్రారంభించాలని ఆయన తెలిపారు. అనంతరం కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ 104 పాఠశాలల్లో పనులు పూర్తికాగా, 322 పాఠశాలల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 12 పాఠశాలలు పనులు పూర్తికాగా ప్రారంభించినట్లు చెప్పారు. కాగా, అభివృద్ధి పనులు ప్రజలు, ఎన్‌ఆర్‌ఐ చేయూత కోసం యత్నిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో అదనపు కలెక్టర్ స్నేహలత, డీఈఓ సోమశేఖరశర్మ, డీఆర్డీఓ విద్యాచందన, ఈఈలు నాగేశ్వర, కేవీకే. శ్రీనివాస్, చంద్రమౌళి, శ్యాంప్రసాద్, ఎంఐఎస్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పనుల పరిశీలన

నేలకొండపల్లి/కూసుమంచి: మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులను టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. నేలకొండపల్లి మండలంలోని సింగారెడ్డిపాలెం, కూసుమంచి మండలం పాలేరులోని ప్రాథమికోన్నత, కూసుమంచిలోని ఉన్నత పాఠశాలల్లో పనులను ఆయన పరిశీలించి వివరాలు ఆరా తీశారు. మన ఊరు – మన బడి పనుల్లో జిల్లా ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆయన వెంట డీఈఓ సోమశేఖరశర్మ, ఎంఈఓ బీ.వీ.రామాచారి, హెచ్‌ఎంలు రేల విక్రంరెడ్డి, గంగాభవాని పాల్గొన్నారు. కాగా, నేలకొండపలిల్లో చైర్మన్ శ్రీధర్‌రెడ్డిని ఆర్‌టీఐ కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ కలిసి ఉన్నత పాఠశాలలోని సమస్యలను వివరించారు.



వేసవి పంటగా అపరాలు సాగు చేసుకోవాలి



అగ్గితెగులు సోకిన వరి పంటను పరిశీలిస్తున్న డీఏఓ విజయనిర్మల

సత్తుపల్లిరూరల్: రైతులు వేసవి పంటగా అపరాలు సాగు చేసుకుంటే మంచిదని జిల్లా వ్యవసాయాధికారి ఎం.విజయనిర్మల సూచించారు. సత్తుపల్లి మండలంలోని రుద్రాక్షపల్లి, బుగ్గపాడుల్లో సాగవుతున్న పంటలు, నమోదు ప్రక్రియను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ వేసవి పంటగా పీబీఎస్–8 రకం మినుము విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా ఇస్తున్నామని, కావాలనుకునే రైతులు ఏఓలను సంప్రదించాలని తెలిపారు. కాగా, ప్రస్తుతం వరిపైరులో అగ్గితెగులు ఉధృతి ఉన్నందున అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ పాటించాలని సూచించారు. మోతాదుకు మించి నత్రజని ఎరువు వాడితే అగ్గితెగులు వ్యాప్తి పెరుగుతుందని తెలిపారు. పంటలపై ద్రవ యూరియా(నానోయూరియా) వినియోగం పెంచడం ద్వారా ఇది మొక్కల నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ ఆకుల్లో కిరణజన్య సంయోగ క్రియను పెంచుతుందని వివరించారు. ఏఓ వై.శ్రీనివాసరావు, ఏడీఏ రాజు, ఏఈఓ డి.స్వాతి, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం



సిలిండర్ పేలుడుతో ధ్వంసమైన ఇల్లు (ఇన్‌సెట్) పేలి ముక్కలైన సిలిండర్

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెంలో శుక్రవారం మధ్యాహ్నం ఓ ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం కావడంతో పాటు నగదు, వస్తువులు కాలిబూడిదయ్యాయి. గ్రామానికి చెందిన బుర్రి వెంకన్న గేదెలను మోపేందుకు వెళ్లగా ఆయన భార్య నాగలక్ష్మి, తల్లి చంద్రమ్మ ఇంటి బయట పనుల్లో నిమగ్నమయ్యారు. ఈక్రమంలో ఇంట్లోని సిలిండర్ ఒక్కసారిగా పేలగా ఇంటి పైకప్పు, గోడలు ధ్వసం అయ్యాయి. అలాగే, మంటలు వ్యాపించగా సామగ్రి, దుస్తులు, పెట్టెలో భద్రపరిచిన రూ.2లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. కాగా, భారీ శబ్దంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. ఈక్రమంలోనే మంటల్లో కాలిపోతున్న వస్తువులను కాపాడే క్రమంలో చంద్రమ్మకు గాయాలయ్యాయి. గ్రామస్తులు ఇచ్చిన సమాచారంతో ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేసినా అప్పటికే సర్వం కోల్పోయిన వెంకన్న కుటుంబీకులు కట్టుబట్టలతో మిగిలారు.

హత్యాయత్నం కేసులో జైలుశిక్ష, జరిమానా

ఖమ్మంలీగల్: ఇద్దరిపై హత్యాయత్నం చేసిన కేసులో గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన నిందితుడు షేక్ సైదాకు మూడునెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధించారు. ఖమ్మం అదనపు ఏఎస్‌జే కోర్టు జడ్జి ఆశారాణి శుక్రవారం వెలువరించిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి. గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన షేక్ అజహరుద్దీన్ కొణిజర్ల మండలం తనికెళ్లలో వెల్డింగ్ షాపు ఏర్పాటుచేయగా, ఆయన వద్ద చిలకలూరిపేటకే చెందిన చెందిన షేక్ సైదా, షేక్ ఖలీషా పనిచేస్తున్నారు. వీరందరూ తనికెళ్లలోని అద్దె గదిలో నివసిస్తున్నారు. అయితే 2020లో లాక్‌డౌన్ సమయాన తనను ఇంటికి పంపించాలని సైదా అడిగే క్రమంలో మే 17న రాత్రి గొడవ జరిగింది. సైదా, ఖలీషాతో గొడవే క్రమంలో అజహరుద్దీన్ సర్దిచెప్పాడు. దీంతో సైదా ఇద్దరిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనపై అజహరుద్దీన్ తండ్రి జిలాని కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా విచారణ అనంతరం సైదాకు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఇర్షాద్ వాదించారు.

పాఠశాల భవనం పైనుంచి పడిన విద్యార్థి

- తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ సమీపాన ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్ విద్యార్థిని పాఠశాల భవనం పైనుంచి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మంకు చెందిన విద్యార్థిని సదరు పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. శుక్రవారం రాత్రి 7గంటల సమయాన ఆమె భవనం మూడో అంతస్తు నుంచి కింద పడడంతో రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పాఠశాల సిబ్బంది వెంటనే ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, విద్యార్థినికి అనారోగ్యం కారణంగా కళ్లు తిరిగి కింద పడి ఉండొచ్చని పాఠశాల యాజమాన్య బాధ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న పీడీఎస్‌యూ నాయకులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు.

పోలీసుల అదుపులో ఫైనాన్స్ ఉద్యోగి?

రఘునాథపాలెం: మండలంలోని పరికలబోడు తండాలో ఓ ఇంటి యజమానిని బకాయి చెల్లించాలని వేధించడమే కాక ఇంటికి తాళం వేసిన ఘటనలో ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ ఉద్యోగిని రఘునాథపాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ఒకరు ఇంటి నిర్మాణం కోసం రూ.1.20లక్షల అప్పు తీసుకుని వడ్డీ సహా చెల్లించినా ఇంకా చెల్లించాలంటూ రెండు రోజులు క్రితం ఇంటికి తాళం వేశాడు. దీంతో యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో సదరు ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని పోలీసులు మాత్రం ధృవీకరించడం లేదు.

కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి

వేంసూరు: కుక్కలు దాడి చేయడంతో నాలుగు మేకలు మృతి చెందిన ఘటన మండలంలోని దుద్దెపూడిలో శుక్రవారం తెల్లవారుజామున జరిగింది. దుద్దెపూడి గ్రామానికి చెందిన వేగి రాజా తన మేకలను రోజులాగే షెడ్‌లో కట్టేసి ఇంట్లో నిద్రించాడు. శుక్రవారం తెల్లవారుజాము కుక్కల గుంపు దాడి చేయగా రూ.50వేల విలువైన నాలుగు మేకలు మృతి చెందాడని బాధితుడు వెల్లడించాడు.

క్లుప్తంగా...



ఉత్తమ పవర్ ప్లాంటుగా ఎస్టీపీపీ

జైపూర్: మంచిర్యాల జిల్లా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు (ఎస్టీపీపీ)ను మరో అవార్డు వరించింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) సంస్థ ఉత్తమ పవర్ ప్లాంటు నిర్వహణలో భాగంగా ఎస్టీపీపీకి ఈ అవార్డును అందించింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి ఆర్కే సింగ్ చేతుల మీదుగా సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణరావు అందుకున్నారు. కాగా, ఎస్టీపీపీ విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణలో వరుసగా అవార్డులు అందుకోవడం విశేషం.

తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా అన్నమనేని

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రైస్ మిల్లర్ల సంఘం ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ జిల్లాకు చెందిన అన్నమనేని సుధాకరరావు, కరీంనగర్ జిల్లా అధ్యక్షునిగా నర్సింగరావులను నియమిస్తున్నామని ఆ సంఘం ప్రకటించింది. ఈ మేరకు అసోసియేషన్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గంపా నాగేందర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మిల్లింగ్ ప్రక్రియ, బియ్యం పరిశ్రమపై సంపూర్ణ అవగాహన కలిగిన వ్యక్తిగా.. పరిశ్రమకు.. ప్రభుత్వానికి మధ్య వారధిగా సుధాకరరావు పనిచేస్తారని అభిప్రాయపడ్డారు.

'జూన్‌కల్లా రోడ్ల మరమ్మతులు పూర్తి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో చాలా కాలం తర్వాత పీరియాడికల్ రెన్యువల్ పనులలో భాగంగా నిర్వహిస్తున్న రాష్ట్ర రహదారుల మరమ్మతులను జూన్‌కల్లా పూర్తి చేయాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ పనులపై శుక్రవారం ఆయన రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ప్రత్యేక కార్యదర్శి విజేంద్ర బోయి, ఈఎన్సీ రవీందర్‌రావులతో సమీక్షించారు. రూ.2875 కోట్లతో చేపట్టిన మొత్తం 1170 పనుల్లో 232 పనులు పూర్తి కాగా, మిగతా వాటిని వేగంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పనుల నిర్వహణ బాధ్యతను 60 ఏజెన్సీలకు అప్పగించినందున, ప్రతి ఏజెన్సీ వారానికి కనీసం ఒక్క పనైనా పూర్తి చేసేలా చూడాలని సూచించారు.

ఇక మొబైల్ ఆస్పత్రులు!

సంయుక్తంగా ఏర్పాటు చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై దృష్టి
- మారుమూల పల్లెవాసులకూ మెరుగైన వైద్యానికి ప్రణాళిక
- పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎంపిక

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని మారుమూల ఆదివాసీ, గిరిజన పల్లెల్లో నివసించే వారికి మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మొబైల్ క్లినిక్‌లను ఏర్పాటు చేయనున్నాయి. పైలట్ ప్రాజెక్టుగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వాటిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

కదిలే ఆస్పత్రి...

మొబైల్ క్లినిక్‌గా తీర్చిదిద్దే వాహనంలో రోగనిర్ధారణ పరీక్షలు, ఔషధాలు, మైనర్ సర్జరీలు చేసేందుకు అనువైన వ్యవస్థ, రెండు బెడ్లు, టాయిలెట్ సదుపాయం ఉంటాయి. ఈ వాహనంలో ఒక డాక్టర్, ఒక ఏఎన్‌ఎం, ఒక మిడ్‌వైఫరీ, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్ ఉంటారు. దీంతోపాటు టెలి మెడిసిన్ వ్యవస్థకు అనువైన సమాచార వ్యవస్థ సైతం అందుబాటులో ఉంటుంది. ఎంపిక చేసిన మండలాల్లో పల్లె దవాఖానాలకు దూరంగా ఉన్న గ్రామాలు, గిరిజన గూడేలకు వారంలో రెండు, మూడుసార్లు రోడ్డు మార్గంలో వీలైనంత దగ్గర వరకు ఈ మొబైల్ క్లినిక్ చేరుకుంటుంది. అక్కడి ప్రజల ఆరోగ్య స్థితిగతులను వైద్యుడు, ఇతర సిబ్బంది పరిశీలించి తగిన మందులు అందిస్తారు. ప్రసవ సమయం దగ్గర పడిన నిండు గర్భిణులతో పాటు ఇతర అత్యవసర వైద్యం అవసరమైన వారిని గుర్తించి ముందుగానే పెద్దాస్పత్రులకు వాహనంలో తరలిస్తారు. మొబైల్ క్లినిక్‌ల వల్ల మారుమూల ప్రాంతాలకు సైతం మెరుగైన వైద్యసేవలు అందుతాయి.

భద్రాద్రి జిల్లాలో

మావోయిస్టు ప్రాభావిత ప్రాంతాల్లో వెనుకబాటుతనం రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏళ్లుగా భారీ మొత్తంలో నిధులు కేటాయిస్తున్నాయి. దీంతో ఇప్పటికే ఏజెన్సీ ఏరియాల్లో రవాణా, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా వైద్యసేవలు సైతం వారి చెంతకు చేర్చే పనికి శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అనుదీప్‌తో జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఇంటెలిజెన్స్ నోడల్ అధికారి ప్రభాకర్ చర్చించారు. జిల్లాలోని చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో మొబైల్ ఆస్పత్రులు ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చారు. ఈ రెండు మండలాల్లో వైద్య సేవలకు దూరంగా ఉన్న ప్రాంతాల్లోని గూడేల ఎంపిక, రూట్ మ్యాప్ ఎంపికపై కసరత్తు ప్రారంభించారు.

రోడ్లు, రవాణా సౌకర్యాలు లేక..

రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా ఉన్నాయి. అక్కడి అటవీ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలకు దూరంగా అనేక గిరిజన గూడేలు ఉన్నాయి. దీంతో ప్రజలు అత్యవసరమైతే తప్ప సాధారణ పరిస్థితుల్లో వైద్యసేవల కోసం ప్రయత్నాలు చేయడం లేదు. ఫలితంగా పురిటి నొప్పులతోపాటు ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రులకు పరుగులు పెడుతున్నారు. కానీ రోడ్లు సరిగ్గా లేకపోవడంతో '108' వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. దీంతో మంచాలు, డోలీలు, కుర్చీల్లో రోగులను ప్రధాన రహదారుల వద్దకు మోసుకెళ్లి అక్కడి నుంచి వాహనంలో ఆస్పత్రులకు తరలించాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో ప్రజల వద్దకే వైద్యసేవలు అందుబాటులోకి తీసుకెళ్లేందుకు మొబైల్ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురానున్నారు.



రోగులను మంచంపై ఆస్పత్రికి తీసుకొస్తున్న ఏజెన్సీ ప్రాంత ప్రజలు (ఫైల్)

'షా'రొస్తున్నారు..!

▶ మొదటి పేజీ తరువాయి

తెలంగాణపైనే పూర్తిగా దృష్టి కేంద్రీకరించనున్నారని పేర్కొన్నాయి.

ఇప్పటికే కర్ణాటకలో షురూ..

కర్ణాటకలో మరో మూడు నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అక్కడ తిరిగి అధికారాన్ని నిలబెట్టుకోవాలని బీజేపీ జాతీయ నాయకత్వం భావిస్తోంది. అయితే కొంతకాలం నుంచి కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందన్న అభిప్రాయం ఉంది. దీనికితోడు రాహుల్ గాంధీ భారత్‌జోడో యాత్రతో కాంగ్రెస్ పార్టీ కాస్త పుంజుకుందన్న అంచనాలూ వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో అప్రమత్తమైన బీజేపీ.. ఆ రాష్ట్రంలో పార్టీని విజయతీరాలకు చేర్చే బాధ్యతను అమిత్‌షాకే అప్పగించింది. గత ఎన్నికల్లో కర్ణాటకలో బీజేపీకి పూర్తి మెజారిటీ దక్కకపోవడానికి నేతల మధ్య కుమ్ములాటలు, సమన్వయం లేకపోవడమే ముఖ్య కారణమని గుర్తించిన నాయకత్వం.. ఈసారి ఆ సమస్య పునరావృతం కాకుండా అమిత్‌షా నేతృత్వంలో జాగ్రత్తలు తీసుకుంటోంది. ఆ రాష్ట్రంలో యావత్ ఎన్నికల వ్యూహ రచన ఆయన కనుసన్నల్లోనే సాగుతోంది. ఎన్నికల సమయం దగ్గరపడుతుండటంతో.. అక్కడే ఇల్లు అద్దెకు తీసుకుని, పూర్తి సమయం కేటాయించేందుకూ అమిత్‌షా సిద్ధమవుతున్నారు. కర్ణాటకలో ఎన్నికలు ముగిశాక.. అదే తరహాలో తెలంగాణపైనా దృష్టి పెట్టనున్నారు.

ఇప్పటికే పరోక్షంగా పర్యవేక్షణ

అమిత్‌షా ఇప్పటికే పరోక్షంగా రాష్ట్ర పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. ఇక్కడి రాజకీయ పరిస్థితులు, బీఆర్‌ఎస్ సర్కార్ తీరు, సీఎం కేసీఆర్ వ్యవహారశైలి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలిస్తున్నారు. పార్టీ పరంగా చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఆయన అదుపాజ్ఞలు, పర్యవేక్షణలోనే కొనసాగుతున్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు. ఈ క్రమంలోనే అమిత్‌షా, ఇతర అగ్రనేతలు కలిసి.. గతంలో లోక్‌సభ, యూపీ ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం కృషిచేసిన జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్‌ను రాష్ట్ర పార్టీ సంస్థాగత ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం బన్సల్ నేతృత్వంలోనే 'ప్రజాగోస–బీజేపీ భరోసా' స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లు, పోలింగ్ బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత పటిష్టత, బూత్ సశక్తికరణ్ అభియాన్ వంటివి చేపడుతున్నారు. ఇక పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఐదు విడతల్లో చేపట్టిన పాదయాత్రతో దాదాపు సగం అసెంబ్లీ నియోజకవర్గాలు కవర్ అయ్యాయి. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో పాదయాత్రలు కాకుండా.. రాష్ట్రంలోని నాలుగైదు రూట్లలో ముఖ్యనేతలంతా సమాంతరంగా పాల్గొనేలా రథయాత్రలు నిర్వహించాలనే ఆలోచనతో ఉన్నట్టు పార్టీ నేతల సమాచారం. దీనికి సంబంధించి త్వరలోనే జాతీయ నాయకత్వం ఓ నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది.

ఏప్రిల్‌లో లోక్‌సభ సీట్లలో రథయాత్రలు

ఎన్నికలకు సమయం దగ్గరపడటంతో రాష్ట్రవ్యాప్తంగా ఐదు రూట్లలో రథయాత్రలు నిర్వహించాలని ఇటీవల అమిత్‌షా సూచించినట్టు తెలిసింది. దీనితోపాటు ఏప్రిల్ మొదటి వారంలో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల వారీగా రథయాత్రలు నిర్వహించాలని నిర్ణయించినట్టు సమాచారం. ఈ మేరకు ఎంపీ స్థానాల్లోని ఒక్కో అసెంబ్లీ స్థానం పరిధిలో ఒక్కో రోజు ఈ యాత్రలు సాగేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

ఇక చేరికలు వేగవంతం!

రాష్ట్రంపై అమిత్‌షా పూర్తిగా దృష్టి సారించనున్న నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేరికలు ఇకపై వేగం పుంజుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ఇటీవల ఢిల్లీలో రాష్ట్ర పార్టీ కోర్‌కమిటీ సభ్యులతో భేటీ అయినప్పుడు కూడా అమిత్‌షా ఈ విషయంపై ఆరా తీసినట్టు తెలిసింది. వివిధ జిల్లాలు, నియోజకవర్గాల్లో ఇతర పార్టీల ముఖ్య నేతలు చేరకపోవడానికి కారణాలేంటి? ఎవరు అడ్డుపడుతున్నారు? వారి అభ్యంతరాలేమిటన్న దానిపై ఆయన నేతలను ప్రశ్నించినట్టు సమాచారం. తొలుత జిల్లా, నియోజకవర్గ స్థాయి నేతలను చేర్చుకుంటే.. వారి వెంట అనుచరులు, కార్యకర్తలు తరలివస్తారని, పార్టీ బలోపేతం అవుతుందని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఏయే జిల్లాల నుంచి ఏ పార్టీల నేతలు బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు? వారు డిమాండ్లు, విజ్ఞప్తులు ఏమిటన్న దానిపై రాష్ట్ర నేతల నుంచి విడివిడిగా జాబితాలు తీసుకున్నట్టు సమాచారం. ఈ క్రమంలో త్వరలోనే చేరికలు ఊపందుకుంటాయని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

సమన్వయం కోసం విందు భేటీలు!

రాష్ట్రంలో ప్రతి పదిహేను రోజులకోసారి కోర్ కమిటీ భేటీ నిర్వహించాలని కొన్నినెలల కింద జాతీయ నాయకత్వం ఆదేశించింది. ముఖ్య నేతల మధ్య సమన్వయం, అభిప్రాయాలు పంచుకోవడానికి, కార్యక్రమాల నిర్వహణపై సూచనల కోసం భేటీలు ఉపయోగపడతాయని భావించింది. కానీ అనుకున్నట్టుగా కోర్ కమిటీ భేటీలు జరగడం లేదు. ఇటీవలి ఢిల్లీ భేటీలో దీనిపై ప్రశ్నించిన అమిత్‌షా.. వారానికి ఒకరోజు నేతల నివాసాల్లో బ్రేక్‌ఫాస్ట్, లంచ్ లేదా డిన్నర్ భేటీలు నిర్వహించి, కలుసుకుంటూ ఉండాలని సూచించినట్టు తెలిసింది. ఈటల రాజేందర్ నివాసంలో సమావేశంతో ఇలాంటి విందు భేటీలకు శ్రీకారం చుట్టాలని పేర్కొన్నట్టు సమాచారం. అమిత్‌షా రంగంలోకి దిగనుండటంతో ఇకపై వరుసగా విందు భేటీలు, సమావేశాలు జరిగే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

232 కోట్లు ఎగ్గొట్టి 'పరుగులు'!

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని ప్రాంతాలకు చెందిన రవాణా వాహనాలను తనిఖీ చేయాలని లక్ష్యాలను నిర్దేశించారు.

గ్రేటర్‌లో ఆటోలు మినహా...

సాధారణంగా వ్యక్తిగత వాహనాలకు ఒకసారి జీవితకాల పన్ను చెల్లిస్తే చాలు. కానీ రవాణా వాహనాలకు మాత్రం ప్రతి 3 నెలలకోసారి త్రైమాసిక పన్ను చెల్లించాల్సి ఉంటుంది. వాహనాల సామర్థ్యం మేరకు దీనిని నిర్ణయిస్తారు. వెయిట్ గ్రాస్ వెహికల్ (డబ్ల్యూజీవీ) ప్రకారం వాహనం బరువుకు అనుగుణంగా త్రైమాసిక పన్ను కనిష్టంగా రూ. 535 నుంచి గరిష్టంగా రూ. 15,000 వరకు ఉంటుంది. గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు జీహెచ్‌ఎంసీలోని సుమారు 1.4 లక్షల ఆటోలను ఈ త్రైమాసిక పన్ను జాబితా నుంచి ప్రభుత్వం మినహాయించింది. మిగతా అన్ని రకాల రవాణా వాహనాలు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఈ జాబితాలో స్కూల్ బస్సులు, ప్రైవేట్ బస్సులు, లారీలు, క్యాబ్‌ల వంటి వాహనాలు ఉన్నాయి. కోవిడ్ కాలంలో పన్ను చెల్లించని రవాణా వాహనదారులు... కోవిడ్ ఆంక్షలను సడలించాక చాలా వరకు చెల్లించారు. కొందరు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఆర్టీఏ అధికారులు అప్పట్లో ఉదారంగా వ్యవహరించడం కూడా ఇందుకు కారణమైంది.

ఎంవీఐలకు పన్ను వసూలు టార్గెట్‌లు!

ఈ నెలాఖరు నాటికి బకాయిలు వసూలు చేయాలని రవాణా కమిషనర్ అధికారులను మౌఖికంగా ఆదేశించినట్లు తెలిసింది. అలాగే వారికి టార్గెట్‌లు విధించారని తెలియవచ్చింది. గతంలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రతి ఎంవీఐకి రూ. 6 లక్షల చొప్పున టార్గెట్ విధించగా ప్రస్తుతం దాన్ని రూ. 7 లక్షలకు పెంచారని సమాచారం. ఈ లెక్కన ఆర్టీఏ కార్యాలయాల్లో పౌరసేవలు అందించే ఎంవీఐలు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా రోజుకు పన్ను చెల్లించని 5 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అలాగే ఎన్‌ఫోర్స్‌మెంట్ విధుల్లో ఉన్నవారు రోజుకు 10 వాహనాలను జప్తు చేసి కేసులు నమోదు చేస్తున్నారు. అయితే జప్తు చేసిన వాహనాలను నిలిపేందుకు సరైన పార్కింగ్ సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నట్లు ఓ ఎంవీఐ పేర్కొన్నారు.

స్వచ్ఛందంగా ముందుకొస్తేనే ఊరట...

త్రైమాసిక పన్ను పెండింగ్ జాబితాలో ఉన్న వాహన యజమానులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి పన్ను చెల్లిస్తే అపరాధ రుసుము ఉండదని అధికారులు చెబుతున్నారు. తనిఖీల్లో పట్టుబడితే మాత్రం 200 శాతం వరకు జరిమానా చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు.

బ్లాంక్ డీడీలతో దళారుల వసూళ్లు

స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సీజ్ చేసిన వాహనాలపై పెనాల్టీతో సహా కట్టాల్సిన బకాయిల మొత్తానికి డీడీ తీసుకురావాలని అధికారులు చెబుతుండటంతో దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. వారు అప్పటికే వివిధ మొత్తాలతో బ్యాంకుల నుంచి తెచ్చిన ఖాళీ డీడీలు చూపి ఒక్కో డీడీపై 'సర్వీస్ చార్జీ'గా రూ.200 వసూలు చేస్తున్నారు. దీంతో ఆరొందల నుంచి రూ.1200 వరకు ఆ రూపంలో అదనపు భారం పడుతోంది. కళ్లముందే ఈ దందా జరుగుతున్నా రవాణాశాఖ అధికారులు చర్యలు తీసుకోవట్లేదు.

జిల్లా వార్తలు

యూసీపీఈలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రారంభం



యూనిట్‌ను ప్రారంభిస్తున్న కోఆర్డినేటర్

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల(యూసీపీఈ)లో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ప్రారంభమైంది. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కాకతీయ యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈ.నారాయణ మాట్లాడారు. ప్రిన్సిపాల్లు డాక్టర్ సీహెచ్.రవికుమార్, ప్రొఫెసర్ కె.రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ వెంకటయ్య, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు పి.కోటి, పి.మధు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు మాజీ ఎంపీ పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఇల్లెందు నియోజకవర్గం బయ్యారంలో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయాన్ని ఆయన ప్రారంభించడంతో పాటు సత్తుపల్లిలో కార్యక్రమాలకు హాజరవుతారని పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

వినయ్‌కు రూ.5వేల ఆర్థిక సాయం

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేట: దమ్మపేట మండలం మందలపల్లి సాంఘిక సంక్షేమ గురుకులంలో సైన్స్ ఫేర్ ఏర్పాట్లు చేస్తుండగా యాసిడ్ బాటిల్ పగిలి తీవ్రంగా గాయపడిన ఆరో తరగతి విద్యార్థి వినయ్ పరిస్థితిపై శుక్రవారం 'సాక్షి'లో 'అయ్యో వినయ్.. సాయం చేసే వారే లేరా?' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అశ్వారావుపేట మండలం అచ్యుతాపురానికి చెందిన జూపల్లి కోదండ రామారావు రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. నగదును ఆయన తండ్రికి పంపించినట్లు తెలిపారు.

తపాలా మహామేళాలో అగ్రగామి

- ఖమ్మం డివిజన్‌లో అత్యధిక ఖాతాలు
- 21,214 మందితో ఖాతాలు తెరిపించిన అధికారులు

మహామేళాలో తొలి ఐదు స్థానాలు సాధించిన డివిజన్లు

డివిజన్	ప్రారంభించిన ఖాతాలు
ఖమ్మం	21,214
ఆదిలాబాద్	14,109
కరీంనగర్	13,099
పెద్దపల్లి	11,069
నిజామాబాద్	10,852



ఖమ్మంలోని పోస్టల్ శాఖ కార్యాలయం

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ దేశవ్యాప్తంగా నిర్వహించిన పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంక్ మహామేళాలో తెలంగాణ సర్కిల్‌లోనే అత్యధిక ఖాతాలు తెరిపించడం ద్వారా ఖమ్మం డివిజన్ ప్రథమస్థానంలో నిలిచింది. గతనెల 20 నుంచి 28వ తేదీ వరకు తపాలా శాఖ పోస్టాఫీస్ సేవింగ్ బ్యాంక్ మహామేళా నిర్వహించింది. ఈ మేళాలో ఖమ్మం డివిజన్ నుంచి 21,214 మందితో కొత్తగా అకౌంట్లు తెరిపించారు.

పది సబ్ డివిజన్లు.. 823 పోస్టాఫీసులు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది సబ్ డివిజన్లలో ఉన్న 823 తపాలా కార్యాలయాల ద్వారా మహామేళా నిర్వహించారు. ఈసందర్భంగా ఖమ్మం నార్త్ సబ్ డివిజన్ అత్యధికంగా 3,420 అకౌంట్లతో ప్రథమ స్థానంలో నిలవగా, మధిర సబ్ డివిజన్‌లో 3,123, ఖమ్మం ఈస్ట్ సబ్ డివిజన్‌లో 2,687 అకౌంట్లు తెరిపించి ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఇటీవల నిర్వహించిన పోస్టల్ పథకాల మహామేళాలోనూ తెలంగాణ సర్కిల్‌లో ఖమ్మం డివిజన్ అగ్రస్థానంలో నిలిచిన విషయం విదితమే. ఇప్పుడు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ల మహామేళాలో కూడా ఖమ్మం డివిజన్ తెలంగాణ సర్కిల్‌లో సత్తా చాటడం విశేషం. కాగా, దేశవ్యాప్తంగా మొత్తం 24 పోస్టల్ సర్కిళ్లు ఉండగా తెలంగాణ సర్కిల్ 1,52,833 ఖాతాలతో ఐదో స్థానంలో నిలిచింది.

ఉద్యోగుల కృషితోనే...

మహామేళాలో ఉద్యోగుల కృషితో ఖమ్మం డివిజన్ తెలంగాణ సర్కిల్‌లోనే అగ్రస్థానం నిలిచింది. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యాన వడ్డీ రేట్లు అధికంగా ఉన్న తపాలా సర్వీసులను ప్రజలు వినియోగించుకోవాలి. ఖాతాలు, డిపాజిట్ల వివరాలను నేరుగా శాఖ కార్యాలయాలు, పోస్ట్‌మ్యాన్, జీడీఎస్ సిబ్బంది వద్ద కానీ, పోస్ట్ ఇన్ఫో, యాప్‌ల ద్వారానైనా తెలుసుకోవచ్చు.

– బి.రవికుమార్, ఖమ్మం డివిజన్ తపాలా సూపరింటిండెంట్

పది జీపీఏ సాధించేలా సిద్ధం కండి



ఎస్సెస్సీ విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ

దుమ్ముగూడెం: రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులు పది జీపీఏ సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రియాంక సూచించారు. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుంటూ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. అలాగే, విద్యార్థులు ఆరోగ్యం, మెనూపై శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షల సమయాన ఒత్తిడికి గురికాకుండా సిద్ధం చేయాలని తెలిపారు. డీడీ వెంట ఐటీడీఏ అధికారులు తెల్లం రమణయ్య, రూపాదేవి, పూనం నరసింహారావు, హెచ్‌ఎంలు మడకం మోతీరు, సర్వేశ్వర్ దొరతో పాటు హరికృష్ణ, కె.పార్వతి, శ్రీనివాసరావు,లక్ష్మణరావు, ఆంజనేయులు, బోడియ, సత్యనారాయణ, ప్రేమ్‌కుమార్, చెన్నారావు, లక్ష్మయ్య, కళ్యాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో రక్షణ చర్యలు తప్పనిసరి



అవగాహన ర్యాలీలో పాల్గొన్న అధికారులు

పాల్వంచ: కర్మాగారాల్లో పనిచేసే సమయాన ఉద్యోగులు, కార్మికులు రక్షణ చర్యలు తప్పక పాటించాలని రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ బి.రాజగోపాల్ సూచించారు. జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారాల్లో సీఈ ఎం.ప్రభాకర్ రావు ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో రాజగోపాల్ మాట్లాడుతూ కర్మాగారాల్లో పనిచేసే వారు చైతన్యవంతులై నిబంధనలను పాటిస్తే ప్రమాదాలు జరగవని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వెంకన్న, అధికారులు సీహెచ్.నితిన్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, టి.సత్యనారాయణ, జీ.వీ.ధర్మారావు, పి.కృష్ణ, పి.రామారావు, సి.జంగయ్య, ఎస్.నాగయ్య, వై.శ్రీనివాసరావు, భాగం రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఖమ్మం వ్యాపారుల నిరసన



కేంద్ర జీఎస్టీ అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం వ్యాపారులు

ఖమ్మంవ్యవసాయం: పత్తి కొనుగోళ్లపై కేంద్ర జీఎస్టీ శాఖ పన్ను చెల్లించాలని నోటీసులు ఇవ్వడంపై ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు శుక్రవారం హైదరాబాద్‌లోని కేంద్ర జీఎస్టీ కమిషనర్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అన్నిరకాల పంటల అమ్మకంపై జీఎస్టీ విధానాన్ని అమలుచేస్తుండగా, పత్తి కొనుగోళ్లపై కూడా పన్ను విధించడం సరికాదని ఆరోపించారు. ఇప్పటికే ఖమ్మం వ్యాపారులు పన్ను చెల్లించాలని నోటీసులు ఇచ్చి ఇబ్బంది పెట్టడంసరికాదని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయంలో సహాయ కమిషనర్లతో వ్యాపారులు భేటీ తమ సమస్యలను వివరించారు. ఖమ్మం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చిన్ని కృష్ణారావుతో పాటు పాటు జీ.వై.నరేష్, మన్నెం కృష్ణ, తల్లాడ రమేష్, నల్లమల ఆనంద్, నల్లమోతు లక్ష్మయ్య పాల్గొన్నారు.

రామయ్య శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు అందచేస్తున్న ఆలయ సిబ్బంది

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందచేశారు. రామాంత్‌పూర్‌కు చెందిన మునుగుల నారాయణరావు, నాగేంద్రమ్మ, వెంకటరామయ్య రూ.1.40లక్షలను ఆలయ అధికారులకు అందచేసి స్వామి వారిని సందర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

7న వసంతోత్సవం, డోలోత్సవం

ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని రామాలయంలో ఈనెల 7న వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు. అలాగే, శ్రీరామనవమి పనుల్లో భాగంగా పసుపు కొమ్ములు దంచి, తలంబ్రాలను కలిపే పనులు మొదలుపెడతామని పేర్కొన్నారు. దీంతో 7వ తేదీన స్వామి వారి నిత్యకల్యాణాన్ని రద్దు చేస్తున్నట్లు తెలిపారు.

ఖమ్మం స్టేషన్‌లో అభివృద్ధి పనులకు గ్రీన్‌సిగ్నల్

ఎంపీ నామకు రైల్వే జీఎం జైన్ లేఖ



ఖమ్మంలో స్టేషన్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ నామ (ఫైల్)

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం రైల్వే స్టేషన్‌లో అమృత్ భారత్ పథకం కింద వివిధ అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించినట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన బీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావుకు శుక్రవారం రాసిన లేఖలో తెలిపారు. దీంతో గతంలో పలుమార్లు ఖమ్మం స్టేషన్‌లో చేపట్టాల్సిన పనులను ఎంపీ రాసిన లేఖలు, చేసిన సూచనలతో కదలిక వచ్చినట్లయింది. ఈమేరకు ఇప్పటికే స్టేషన్‌లో ఏర్పాటుచేసిన ఎస్కలేటర్లను త్వరలోనే ప్రారంభించనుండగా, ఇతర సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జీఎం తెలిపారు. ఇప్పటికే ఉన్న ఎనిమిది సీసీ కెమెరాలకు తోడు నిర్భయ నిధుల కింద అదనంగా 60 సీసీ కెమెరాలు, ప్లాట్‌ఫారంలపై అదనంగా అంబరిల్లా పనులు, నాలుగు ఆటోమేటిక్ వాటర్ వెండింగ్ యంత్రాలు, మహిళల కోసం ప్రత్యేక వెయిటింగ్ హాల్, గార్డెనింగ్, ప్లాంటేషన్ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

ఢిల్లీ కిసాన్ మేళాలో టేకులపల్లి బృందం



స్టాల్‌లో డ్రోన్‌ను పరిశీలిస్తున్న సంఘం సభ్యులు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 12వ డివిజన్‌లోని టేకులపల్లి ఆంధ్రాబ్యాంక్ కర్షకసేవా సహకార సంఘం బృందం సభ్యులు ఢిల్లీలోని కృషి విజ్ఞాన కేంద్రంలో భారత వ్యవసాయ విశ్వవిద్యాలయాల ఆధ్వర్యాన శుక్రవారం ఏర్పాటు చేసిన మేళాలో పాల్గొన్నారు. చైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, ఎండీ సాకేత్‌కుమార్‌తో పాటు డైరెక్టర్లు అక్కడి మేళాలో వివిధ పంటల సాగు విధానం, మేలు రకం విత్తనాలు, సాగుకు ఉపయోగపడే ఆధునిక పరికరాలను పరిశీలించి ఉపయోగాలను తెలుసుకున్నారు. డైరెక్టర్లు లింగా నాగార్జున, మన్నెపల్లి రవి, రావెళ్ల కిషన్, ఇనప రాంబాబు, వాకదాని రాంనారాయణ, కుర్రా భాస్కరరావు, బి.ఉపేందర్, పొన్నం వెంకటరమణ, రేపాకుల రవి తదితరులు పాల్గొన్నారు.

'తొలిమెట్టు' ప్రగతిని పరిశీలించిన రాష్ట్ర బృందం

కూసుమంచి: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన తొలిమెట్టు కార్యక్రమ అమలును శుక్రవారం రాష్ట్ర పరిశీలక బృందం తనిఖీ చేసింది. బృందం కన్వీనర్ యానాల వెంకటరెడ్డి, రాష్ట్ర పరిశీలకులు బాలమురళి కూసుమంచిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంతో పాటు కూసుమంచి, జీళ్లచెరువు ఉన్నత పాఠశాలలను సందర్శించారు. పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించాక వారు మాట్లాడుతూ విద్యార్థులను గ్రూపులుగా విభజించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వారి ప్రగతిని తల్లిదండ్రులకు వివరించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ రవికుమార్, ఎంఈఓ బీ.వీ.రామాచారి పాల్గొన్నారు.